క్లుప్తంగా

మానవహక్కుల పరిరక్షణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణారెడ్డి

గుంతకల్లు రూరల్: మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని జాతీయ మానవహక్కుల పరిరక్షణ సమితి జాతీయ కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎస్ కృష్ణారెడ్డి సభ్యులకు సూచించారు. బుధవారం స్థానిక వాల్మీకి కల్యాణమండపంలో జాతీయ మానవహక్కుల పరిరక్షణ సమితి అనంతపురం, సత్యసాయి జిల్లాల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సమితి పట్టణాధ్యక్షుడు బోయ వెంకటేష్ ప్రమాణ స్వీకారం చేశారు. జాతీయ అధికార ప్రతినిధి రాంతి జాన్ వెస్లీ, సభ్యులు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ మీట్

తాడిపత్రి అర్బన్: మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ మీట్ నిర్వహించనున్నట్లు మేనేజర్ రాజేశ్వరీబాయి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

బక్రీద్ ప్రశాంతంగా జరుపుకోండి



మాట్లాడుతున్న ఉమా మహేశ్వరరెడ్డి

గుంతకల్లు రూరల్: ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పర్వదిన వేడుకలను నిర్వహించాలని రూరల్ సీఐ ఉమా మహేశ్వరరెడ్డి ముస్లింలకు సూచించారు. బుధవారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముస్లిం మతపెద్దలతో రూరల్ సీఐ ఉమా మహేశ్వరరెడ్డి, ఎస్ఐ సురేష్ సమావేశం నిర్వహించారు. పండుగ సందర్భంగా ఎక్కడా గోవధ చేపట్టకూడదని సూచించారు.

సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కోట జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాఠశాల విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోట పాఠశాల హెచ్ఎం సుబహాన్, అధ్యాపకులు రఘు, దేశాయి నాగరాజు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటరురు.

గొలుసు దొంగలపై అప్రమత్తంగా ఉండాలి

గార్లదిన్నె: బంగారు గొలుసు దొంగల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సాగర్ పేర్కొన్నారు. బుధవారం మర్తాడు ఎస్సీ కాలనీలో చైన్ స్నాచర్లు, రోడ్డు భద్రత, డయల్ 100 గురించి మహిళలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మహిళలపై లైంగిక దాడులు, దాడులు జరిగితే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు.

కోమటికుంట్లలో గ్రామసభ

పుట్లూరు: కోమటికుంట్ల గ్రామంలో బుధవారం సామాజిక తనిఖీపై గ్రామసభ నిర్వహించారు. గతేడాది చేపట్టిన ఉపాధిహామీ పనులపై తనిఖీలు నిర్వహించిన సామాజిక తనిఖీ బృందం సభ్యులు గ్రామసభ ద్వారా వివరాలను వెల్లడించారు.

వృద్ధురాలు మృతి

గార్లదిన్నె: మండల కేంద్రంలో బుధవారం రాత్రి బైక్‌పై నుంచి ఓ వృద్ధురాలు కింద పడి మృతి చెందింది. 108 సిబ్బంది వివరాల మేరకు.. గార్లదిన్నెకు చెందిన కళావతి(75) ఆమె అల్లుడు శ్రీనివాసులుతో కలిసి బైక్‌పై తలగాచిపల్లి వద్ద నుంచి గార్లదిన్నెకు బయలుదేరింది. మధ్యలో కళ్లు తిరిగి ద్విచక్రవాహనం నుంచి కింద పడడంతో కళావతి అక్కడికక్కడే మృతి చెందింది. శ్రీనివాసులకు గాయాలు కావడంతో అతడిని స్థానికులు 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చంద్రబాబును నమ్మి మోసపోవద్దు

- ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి



బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

గుత్తి రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు ఇచ్చే అబద్ధపు హామీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి సూచించారు. బుధవారం ఇసురాళ్లపల్లిలో సర్పంచ్ వాసుదేవరెడ్డి, నాయకులు శేషారెడ్డి, పుల్లారెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. నాలుగేళ్లలో ప్రజలకు అందిన లబ్ధికి సంబంధించిన కరపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ముందుగా గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో హామీలు నెరవేర్చకుండా ప్రజలకు మోసం చేసిన చంద్రబాబు 2024లో అనేక అబద్ధపు హామీలను ఇస్తూ ప్రజల ముందుకు వస్తున్నాడని, బాబు మాటలు నమ్మవద్దని ఎమ్మెల్యే ప్రజలకు తెలిపారు. పసుపు, కుంకుమ, ముక్కుపుడక, బంగారు గాజులు ఇస్తా అంటూ ప్రజలకు మోసం చేసేందుకు బాబు మళ్లీ కట్టుకథలు వల్లిస్తున్నాడన్నారు. 2014 నుంచి 19 వరకూ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు చేయలేదో తెలుసుకోవాలని ప్రజలకు వివరించారు. చెప్పిన వాటితో పాటుగా చెప్పనివి సీఎం జగనన్న చేస్తున్నాడని మరో మారు జగనన్న, తనను ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుసంధానంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారన్నారు. జగనన్న సురక్ష ద్వారా జనన, మరణ, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, మ్యుటేషన్‌తో పాటుగా మరో నాలుగు సేవలను ఉచితంగా ప్రజలకు అందిస్తామన్నారు. 11 రకాల పత్రాలు కావాల్సిన వారు వలంటీర్ల వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగులకు ఎమ్మెల్యే ఆదేశించారు. గుంతకల్లు మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ సునీలా యాదవ్, నాయకులు మనోహర్‌రెడ్డి, ఓబుళరెడ్డి, భరత్‌రెడ్డి, సుంకయ్య, హనుమంతు, గురుప్రసాద్, జయప్రసాద్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు ఫరూక్, వరదరాజులు, వాల్మీకి శివ, రమణ, నరేష్, నాయకులు క్రషర్ మధు, గురుప్రసాద్ యాదవ్, సుభాష్‌రెడ్డి, మల్లయ్య యాదవ్, ఇబ్రహీం, రంగస్వామిఈఓఆర్డీ శివాజీరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్వే పక్కాగా చేపట్టాలి



బొందలవాడలో సమావేశమైన అధికారులు

పామిడి: జగనన్న సురక్ష సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఈఓఆర్డీ బీవీ శశికళ అన్నారు. బుధవారం దేవరపల్లి గ్రామ సచివాలయంలో ఆమె సచివాలయ సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. ఈనెల 30 వరకూ ఈ సర్వే భాగంగా సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ధృవీకరణ పత్రాల అవసర సమాచారాన్ని సేకరించాలన్నారు. అనంతరం ఆమె గ్రామంలో సర్వేను పరిశీలించారు. సర్పంచ్ వై సూర్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నార్పల: జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ సురేష్‌బాబు, ఈఓఆర్డీ లక్ష్మీనరసింహ సిబ్బందికి సూచించారు. బుధవారం బొందలవాడ, బండ్లపల్లి గ్రామ సచివాలయాలను సందర్శించి సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేయడమే కార్యక్రమ ఉద్దేశమన్నారు.

గుత్తి: పట్టణంలోని పలు వార్డుల్లో బుధవారం జగనన్న సురక్షపై మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కౌన్సిలర్లు, సచివాలయ ఉద్యోగులు, వార్డు వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి జగనన్న సురక్ష గురించి వివరించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే 'గడప గడపకూ'



27వ వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న కేతిరెడ్డి సాయి ప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిందని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువ నేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 27వ వార్డులో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కుల,మత రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గ్రామ/వార్డు సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల గడప వద్దే పథకాలు అందిస్తున్నారన్నారు. గతంలో జన్మభూమి కమిటీల సిఫారసు ఉంటేనే పథకాలు అందేవని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రరెడ్డి, విద్యార్థి విభాగం పట్టణాధ్యక్షుడు మనోజ్, నాయకులు అంబటి రాఘవ, టీకే ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పామిడి: పట్టణంలోని రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో బుధవారం స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా రుక్మిణీ, పాండురంగస్వామి మూలవిరాట్లను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డబ్బేదార్ ఫిర్కా, రంగసుబే ఫిర్కా ఆధ్వర్యంలో వేర్వేరుగా రుక్మిణీ పాండురంగస్వామి పోతి ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. భావసార క్షత్రియ భజన మండళ్ల ఆధ్వర్యంలో దిండి భజనలతో నగర ప్రదర్శన చేపట్టారు. రాత్రి హరికథ కాలక్షేపం నిర్వహించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణంలోని బాలాజీ లాడ్జికి ఎదురుగా బుధవారం బైక్ ఢీ కొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు..కూడేరు కు చెందిన వెంకటేష్ తన భార్యతో కలిసి గుత్తికి వచ్చాడు. బాలాజీ లాడ్జి వద్ద రోడ్డు దాటుతుండగా బైక్ వేగంగా వచ్చి వెంకటేష్‌ను ఢీ కొంది. ప్రమాదంలో వెంకటేష్ కాలు విరిగింది. 108లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యులు అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బైపాస్ లైన్ పనులు హర్షణీయం

గుంతకల్లు: మల్లప్పగేట్ నుంచి నంచర్ల బైపాస్ లైన్ పనులు చేపట్టడం హర్షణీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ.జగదీష్ పేర్కొన్నారు. బుధవారం మల్లప్పగేట్ సమీపంలో జరుగుతున్న బైపాస్ లైన్ రైలు మార్గం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతకల్లు జంక్షన్ మీదుగా నడిచే పలురైళ్లు అలస్యంగా రాకపోకలు సాగిస్తున్నాయని, బైపాస్ లైన్ రైలు మార్గం నిర్మించడం ద్వారా కొంతమేర ఈ సమస్యకు పరిష్కారం అవుతుందన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

బుక్కరాయసముద్రం: పంటలు సాగు చేసే ముందు రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏడీఏ రవి సూచించారు. బుధవారం ఆయన రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన భూసార పరీక్ష నమూనాలను పరిశీలించారు.

నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న డాక్టర్ కిశోర్

గుంతకల్లు: ప్రైవేట్ బ్లడ్ బ్యాంకులు నిబంధనలు పాటించాలని ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జేడీ డాక్టర్ కిశోర్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో జిల్లాలోని ప్రైవేట్ బ్లెడ్ బ్యాంకు నిర్వాహకులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తే అందులో 30 శాతం రక్తాన్ని ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌కు ఇవ్వాలన్నారు. ఇక గుంతకల్లులోని గోపీ బ్లడ్ బ్యాంకు రోజుకు ఒక్క బ్లడ్ క్యాంపు నిర్వహించాలని ఉన్నా.. రోజుకు రెండు, మూడు క్యాంపులు నిర్వహిస్తోందన్నారు. బ్లడ్ బ్యాంకులు నిబంధనలు ధిక్కరిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. గుంతకల్లు ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ వైద్యులు వంశీకృష్ణ, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్‌యాదవ్, హైకోర్టు న్యాయవాది కే.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బక్రీద్ శుభాకాంక్షలు



గుంతకల్లుటౌన్: బక్రీద్ పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి నియోజకవర్గంలోని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీకగా జరుపుకునే పవిత్ర పండుగ బక్రీద్ అని, భక్తిని, త్యాగగుణాన్ని ఈ పండుగ చాటి చెబుతుందని ఆయన బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. తోటి మనుషుల పట్ల కరుణ, త్యాగం, సహనంతో వ్యవహరించడానికి ఈ పండుగ స్ఫూర్తి కలిగిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

తాడిపత్రి అర్బన్: బక్రీద్ , తొలి ఏకాదశి పండుగ పర్వదినాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భక్తికి, త్యాగానికి బక్రీద్ ప్రతీకగా నిలుస్తున్న బక్రీద్ పండుగ జీవితంలో ఎదురయ్యే సమస్యలకు వెరవకుండా దేవునిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవించాలని మానవాళికి గొప్ప సందేశాన్ని ఇస్తుందన్నారు. తొలి ఏకాదశితో పండుగలే కాదు వానలు కురిసి వ్యవసాయ పనులు ఊపందుకుంటాయని పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా రైతులు సుఖసంతోషాలతో విరాజిల్లాలని ఆకాంక్షించారు.

శింగనమల: ముస్లింలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దైవ ప్రవక్త మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ పండుగను ఘనంగా జరుపుకోవాలన్నారు. ఈ మేరకు ఆమె బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

నేడు ఈద్గాల వద్ద రక్తదాన శిబిరాలు

గుంతకల్లుటౌన్: ముస్లింల బక్రీద్ పండుగను పురస్కరించుకుని రెడ్‌డ్రాప్ బ్లడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం పట్టణంలోని ఎస్‌జేపీ హైస్కూల్, మస్తాన్‌వలి దర్గా, ఎఫ్‌సీఐ ఎదురుగా ఉన్న ఈద్గా మైదానాల వద్ద రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు రెడ్‌డ్రాప్ వ్యవస్థాపకుడు రెహమాన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రక్తదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

విద్యుత్ చార్జీలు తగ్గించేదాకా పోరాటం

గుంతకల్లుటౌన్: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించేంత వరకు పోరాడుతూనే ఉంటామని సీపీఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు అన్నారు. విద్యుత్ చార్జీలను తగ్గించాలని ఈ నెల 30న వామపక్షాల ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం ఆ పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. రాము నాయక్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైతే చర్యలు

పెద్దవడుగూరు : చిత్రచేడు అంగన్‌వాడీ కార్యకర్త సావిత్రమ్మ , హెల్పర్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం గ్రామంలో కార్యకర్తపై విచారణ చేపట్టారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు మెమో జారీ చేశామని ఆమె తెలిపారు.

సామాజిక తనిఖీకి సిద్ధంకండి

యల్లనూరు: మండలవ్యాప్తంగా జూలై 16 నుంచి సామాజిక తనిఖీ జరగనుందని, ఇందుకు సిద్ధం కావాలని ఎంపీడీఓ వీరరాజు సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సామాజిక తనిఖీ కోసం రికార్డులు సిద్ధం చేసుకోవాలన్నారు. పండ్లమొక్కల పెంపకం పనులను మొదలు పెట్టాలని ఆదేశించారు. ఏపీఓ షబ్బీర్‌బాషా, ఈసీ బబ్లు, టెక్నికల్ అసిస్టెంట్లు ప్రతాప్, అదిల్, శ్రీనివాసులు, శంకర్, జయరాం, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్‌కు గాయాలు

యల్లనూరు: ఉపాధి హామీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న గిరి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వివరాలు.. బుధవారం ఆయన తాడిపత్రి నుంచి విధులకు బైక్‌పై బయల్దేరాడు. పుట్లూరు మండలం శనగలగూడూరు వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. మోకాలికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం యల్లనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కంపచెట్ల తొలగింపు

గార్లదిన్నె: ఎగువపల్లిలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు,అనంతపురం మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి తన డబ్బుతో రోడ్డుకు ఇరు వైపులా పెరిగిన కంపచెట్లు తొలగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోకి వెళ్లే రహదారికి ఇరువైపులా కంప చెట్లు పెరిగి ఇబ్బంది పడుతున్నట్లు గ్రామస్తులు తన దృష్టికి తెచ్చారన్నారు. దీంతో జేసీబీతో రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు తొలగించామన్నారు. నాయకులు వీరయ్య, చీమల శ్రీనివాసులు, బాలిరెడ్డి, శివ, గోసు రఘునాథరెడ్డి, సింగరయ్య, రామక్రిష్ణ, కేశవయ్య తదితరులు పాల్గొన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్..



నార్పలలో సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న విద్యార్థినులు

నార్పల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం పార్వతీపురం జిల్లా కురుపాంలో అమ్మఒడి నిధులు విడుదల చేయడంతో స్థానిక మహాత్మా జోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో థ్యాంకూ సీఎం సార్ అంటూ ప్లకార్డు పట్టుకుని ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంగత కుమారి మాట్లాడుతూ జగనన్న నాలుగోవ విడత అమ్మఒడి పథకం ద్వారా నిధులు ఇవ్వడం ఎంతో గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో తల్లితండ్రుల కమిటీ చైర్‌పర్సన్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

28,237 మందికి అమ్మఒడి

శింగనమల: నియోజకవర్గానికి చెందిన 28,237 మంది విద్యార్థులు అమ్మఒడి ద్వారా లబ్ధి పొందనున్నారు. బుక్కరాయసముద్రం మండలంలో 7,206 మంది విద్యార్థులకు రూ.9,36,78,000, గార్లదిన్నె 5,215 మంది విద్యార్థులకు రూ.6,77,95,000, నార్పల 5,503 మంది విద్యార్థులకు రూ.7,15,39,000, శింగనమల 4,055 మంది విద్యార్థులకు రూ.5,27,15,000, పుట్లూరు 3,239 మంది విద్యార్థులకు రూ.4,21,07,000, యల్లనూరు మండలంలో 3019 మంది విద్యార్థులకు రూ.3,92,47,000 నగదు జమ కానుంది.

మాటిచ్చాడు...ఒక్క రోజులోనే నెరవేర్చాడు

- కార్యకర్తకు ఎమ్మెల్యే వైవీఆర్ రూ.లక్ష అందజేత



కార్యకర్తకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుత్తి రూరల్: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కార్యకర్తకు మాటిచ్చిన ఒక్క రోజులోనే నెరవేర్చి పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి భరోసా కల్పించారు. వివరాల్లోకి వెళ్తే... పాతకొత్తపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ క్రియాశీలక కార్యకర్త అబ్దుల్ రహిమాన్ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి అహర్నిశలూ పాటుపడ్డాడు. అయితే ఇటీవల అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 27న గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకి అబ్దుల్ రహిమాన్ పరిస్థితిని స్థానిక నాయకులు వివరించారు. తనకు నలుగురు పిల్లలు ఉన్నారని కుటుంబం గడవడం కష్టంగా మారిందని బాధితుడు రహిమాన్ ఎమ్మెల్యేతో వాపోయాడు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి హామీ ఇచ్చి రేపు గుంతకల్లుకు రావాలని చెప్పారు. అందులో భాగంగా అబ్దుల్ రహిమాన్‌ను కొత్తపేట సర్పంచ్ గురుమస్తాన్ ద్వారా గుంతకల్లుకు పిలిపించుకున్నారు. తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో అబ్దుల్ రహిమాన్ రూ.1 లక్ష చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యేకు అబ్దుల్ రహిమాన్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయి సెమినార్‌లో ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి, ఫ్యాకల్టీ జాతీయ స్థాయి టెక్నికల్ సదస్సులో ప్రతిభ కనబరినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. ఇటీవల భువనేశ్వర్‌లో ఎంఐసీ, ఏఐఈటీఈ నిర్వహించిన 5 రోజుల ఫ్యాకల్టీలో బూట్, క్యాంప్ ఇన్నోవేషన్ డిజైన్, ఎంటర్‌రెన్యూర్‌షిప్ (ఐడీఈ)లో కళాశాలకు చెందిన ఫ్యాకల్టీ డాక్టర్ ఆంజనేయులు కోఆర్డినేటర్‌గా పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. చెన్నైలో నిర్వహించిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ బూట్ క్యాంప్‌లో తమ కళాశాలకు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ డేటా సైన్స్ విద్యార్థి లోక్ సాయి అత్యంత ప్రతిభ కనబరిచారన్నారు. ప్రతిభ కనబరిచిన ప్రొఫెసర్ అంజనేయులు, విద్యార్థి లోక్ సాయిని బుధవారం కళాశాల టీపీఓ రంజిత్‌రెడ్డి, సీఎస్ హెచ్ఓడీ డాక్టర్ చిత్ర లింగప్ప, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఐక్యూఏసీ సభ్యులు డాక్టర్ సాయి చైతన్య కిశోర్ అభినందించారు.

సంక్షిప్త సమాచారం

గుంతకల్లు హౌసింగ్ ఏఈగా సంపత్

అనంతపురం టౌన్: గృహ నిర్మాణ శాఖ గుంతకల్లు రూరల్ అసిస్టెంట్ ఇంజినీర్‌గా సంపత్‌ను నియమిస్తూ ఆ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కేశవనాయుడు బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. ప్రస్తుతం అక్కడ ఏఈగా పని చేస్తున్న జనార్దన్‌బాబు శుక్రవారం పదవీ విరమణ చేయనున్నారు. దీంతో గృహ నిర్మాణ సంస్థ పీడీ కార్యాలయంలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న సంపత్‌ను గుంతకల్లు రూరల్ రెగ్యులర్ ఏఈగా నియమించారు.

దంత వైద్య శిబిరం

గుంతకల్లు రూరల్: ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో తిమ్మాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ దంతవైద్యులు డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ నజ్మీర్ షేక్ దాదాపు 150 మంది విద్యార్థులకు దంతవైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రెసిడెంట్ త్రిశ్లాబన్సాలీ, ఉపాధ్యాయులు గణేష్, దత్తు, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

పుట్లూరు: కడవకల్లులో బుధవారం మండల స్పెషల్ ఆఫీసర్ ఓబులమ్మ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందజేస్తున్న భోజన మెనూపై ఆరా తీశారు. అనంతరం గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

హెల్త్ సూపర్‌వైజర్‌గా హాజీవలి

యల్లనూరు: యల్లనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్‌గా హాజీవలి బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సూపర్‌వైజర్ తిరుపాలయ్య గుంతకల్లు మండలం నాగలాపురం పీహెచ్‌సీకి బదిలీపై వెళ్లారు. పుట్లూరులో పనిచేస్తున్న హాజీవలిని ఇక్కడికి బదిలీ చేశారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

శింగనమల: గత ఖరీఫ్, రబీ సీజన్‌లో పంట నమోదు చేసుకుని ఈ-కేవైసీ చేసుకోని రైతుల జాబితా ఆర్బీకేల్లో ఉందని, వారు ఈనెల 30లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ అన్వేష్‌కుమార్ తెలిపారు. ఈ-కేవైసీ పూర్తయిన రైతులకు జూలైలో పీఎం కిసాన్ మొత్తం జమ అవుతుందన్నారు. వెస్ట్ నరసాపురం రైతులు కల్లుమడి వీహెచ్ఏ నరేష్, ఆకులేడు ఆర్బీకే రైతులు సీ.బండమీదపల్లి వీహెచ్ఏ అమరేష్‌ను సంప్రదించాలని సూచించారు.

మాజీ స్టోర్ డీలర్ మృతి

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో నివాసముండే మాజీ సీనియర్ స్టోర్ డీలర్ రహంతుల్లా (78) బుధవారం తెల్లవారు జామున అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రహంతుల్లా మృతి పట్ల వైఎస్సార్ సీపీ నాయకులు సంతాపం తెలిపారు.

పామిడి ఆలయ ఈఓగా కృష్ణయ్య

పామిడి: పామిడి ఆలయ కొత్త ఈఓగా కృష్ణయ్య బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పెన్నహోబిలం ఈఓ విజయకుమార్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించేవారు. ఉరవకొండలో పని చేస్తున్న కృష్ణయ్య బదిలీపై ఇక్కడికి వచ్చారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

శింగనమల: యోగాతో మానసిక ఒత్తిడి దూరమవుతందని సీడీపీఓ ఉమాశంకరమ్మ తెలిపారు. స్థానిక సీడీపీఓ కార్యాలయంలో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు యోగాపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలతో రోజూ యోగా చేయించాలన్నారు. అందుకోసమే ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రత్యేక చొరవ తీసుకుని యోగాపై శిక్షణ ఇప్పిస్తున్నారన్నారు. అనంతరం యోగా మాస్టర్ నరేష్ అంగన్‌వాడీ కార్యకర్తలకు యోగాసనాలపై అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

తాడిపత్రి: చుక్కలూరు వద్ద తాడిపత్రి - గుత్తి రహదారిపై బుధవారం రహదారి పక్కన ఆగి ఉన్న లారీని మరో లారీ వెనుక వైపు నుంచి ఢీ కొనడంతో అందులోని లారీ డ్రైవర్, క్లీనర్ తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. తాడిపత్రికి ఐరన్ పైపులతో వస్తున్న మరో లారీ ముందు టైర్ ఒక్కసారిగా పగలడంతో అదుపు తప్పి రహదారి పక్కన నిలిపి ఉంచిన మట్టి లారీని ఢీకొంది. ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ అభయ యాదవ్, క్లీనర్ ముకేష్ ప్రసాద్ గాయపడ్డారు. స్థానికులు 108లో వారిని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బైకులు ఢీకొని..

యాడికి: ఎదురెదురుగా బైకులు ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు..చందన గ్రామానికి చెందిన ఆంజనేయస్వామి పూజారి శశికుమార్, శివశంకర్ స్వగ్రామం నుంచి బైక్‌పై రాయల చెరువుకు బయలుదేరు. అదే సమయంలో చంద్రన గ్రామానికి చెందిన మహేష్, పార్వతి బైక్‌పై రాయలచెరువు నుంచి వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఘటనలో శశికుమార్, శివశంకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. మహేష్, పార్వతి స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు వారిని 108లో తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.